




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

గ్రేటర్ హైదరాబాద్

మంగళవారం 23 డిసెంబర్ 2025 పేజీలు 10


# రిజర్వాయర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలి



- చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశం
- ఓఆర్ఆర్ ఫేజ్ 2 రిజర్వాయర్లను సందర్శించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):గత రెండు సంవత్సరాల్లో ప్రారంభించిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బృందవన్ కాలనీ, మంచిరేవుల, నార్సింగి రిజర్వాయర్లను సోమవారం ఆయన అధికారులతో కలసి సందర్శించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రిజర్వాయర్ల చుట్టూ రక్షణగా ప్రహరీ గోడలను నిర్మించాలని, దానికి సంబంధించిన ప్రధిపాదనలు సమర్పించాలి అధికారులను ఆదేశించారు.ప్రాంగణంలో చెత్తా.. చెదారం తొలగించి రిజర్వాయర్ ఆవరణ శుభ్రంగా ఉండేలాగా చూసుకోవాలని అన్నారు. అలాగే గార్డెనింగ్ పనులు, అంతర్గ రహదారులు నిర్మాణం చేపట్టి సుందరీ కరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఎండీ సూచించారు.కొందరు ప్రైవేట్ వ్యక్తులు కొన్ని జలమండలి స్థలాల్లో వాహనాల్లో తెచ్చిన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. అలాంటి వాహనాలను సీజ్ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎత్తయిన గేటును నిర్మించి అందరికీ కనిపించే విధంగా రిజర్వాయర్ వివరాలు రాయించి, రక్షిత స్థలము, ప్రవేశం నిషిద్ధం అని సైన్ బోర్డ్ ఏర్పాటు చేయమని చెప్పారు. అలాగే జలమండలి స్థలాలను రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులతో అన్నారు.

మిగతా 2లో

# ఆన్ లైన్ మోసాలపై అవగాహన

- ఐపీఎస్ అధికారి హర్షవర్ధన్
- ఆత్మీయ అతిథిగా పరితోష్ పంకజ్





హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) సహకారంతో, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'మోసాలకు పూర్తి విరామం' (ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్) పేరిట అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అంతటా ప్రజల అవగాహనను పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం లక్ష్యంగా ఆరు వారాల రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఐపీఎస్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పు, సైబర్ నేరస్థులు ఉపయోగించే సాధారణ మోసపూరిత పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసానికి గురయ్యే అవకాశాలున్నాయని, మొబైల్ పరికరాలలో హానికరమైన సాఫ్ట్ వేర్ ను సులభంగా ఇన్ స్టాల్ చేయవచ్చన్నారు. ఇది బ్లాక్ మెయిల్, దోపిడీ, డేటా దుర్వినియోగానికి దారితీయొచ్చని ఆయన హెచ్చరించారు. ఆన్ లైన్ గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్ (ఇది తెలంగాణాలో నిషేధించారు), ఆన్ లైన్ చాటింగ్ లో పాల్గొనేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎందుకంటే, ఈ ప్లాట్ ఫారమ్ లు తరచుగా వినియోగదారులను తీవ్రమైన ఆర్థిక, వ్యక్తిగత ప్రమాదాలకు గురిచేస్తాయని హర్షవర్ధన్ తెలియజేశారు. సంగారెడ్డి పోలీసు సూపరింటెడెంట్ పరితోష్ పంకజ్, ఐపీఎస్, ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఓటీపీ మోసం, పెట్టుబడి మోసం, పార్శిల్ మోసం, డిజిటల్ అరెస్టు స్కామ్ లు, హానికరమైన ఏపీకే ఫైల్ ట్రాపులు, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లతో సహా ప్రజలను ప్రభావితం చేసే వివిధ రకాల ఆన్ లైన్ మోసాల గురించి ఆయన వివరించారు. సైబర్ నేరాలకు దారితీసే సాధారణ తప్పులను ఎత్తిచూపారు. ఈ మోసం బారిన పడినవారు తక్షణమే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి కాల్ చేయడం ద్వారా, లేదా మోసం జరిగిన గంటల వ్యవధిలోనే cybercrime.gov.in ఫిర్యాదు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్-కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీ.ఆర్.శా అధ్యక్షత వహించారు. సైబర్-సురక్షిత తెలంగాణను నిర్మించడంలో సహాయపడటానికి వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవడానికి, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్ లను నివారించడానికి, ఆన్ లైన్ లావాదేవీలను ధృవీకరించడానికి, సైబర్ అవగాహ నను ప్రోత్సహించడానికి విద్యార్థులతో సైబర్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.అవగాహనా కార్యక్రమంలో భాగంగా, పోస్టర్లు, ఆడియో క్లిప్పులు, జింగిల్స్, ఇతర సమాచారా సామాగ్రిని ఆవిష్కరించి, విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి డీఎస్పీ కే.వీ. సూర్యప్రకాశ్, బీటెక్ తొలి ఏడాది సమన్వయ కర్త ప్రొఫెసర్ పి.త్రినాథరావు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, పటాన్ చెరు ఎస్ హెచ్ వో వినాయక్ రెడ్డి, టీసీఎస్ బీ ఇన్ స్పెక్టర్ రవి, ఎస్ బీ ఇన్ స్పెక్టర్ నాగరాజు తదితరులు కూడా పాల్గొన్నారు

## ఆలయాల అభివృద్ధికి

# సంపూర్ణ సహకారం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి .హన్మంతరావు
- విజయ వినాయక ఆలయంలో మైనంపల్లి ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సోమవారం ఆయన విజయ వినాయక ఆలయాన్ని సంద ర్శించారు. స్వామివారి పూజలో ఆయన పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. వాణిన గర్ లోని విజయ వినాయక ఆలయ స్థలంలో మఠం నిర్మాణానికి ఎండోమెంట్ కమిషనర్ సహక రించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మైనంపల్లిని కలిసి, వాణిన గర్ లో రోడ్డు, డ్రైనేజీ పైప్ లైన్ సమ స్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, జిహె చ్ఎంసి జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఆయా పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మైనంపల్లి హన్మంతరావు అధికా రులను ఆదేశి ంచారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ఎండోమెంట్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు తుమ ట్ల వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, పీవీ సత్యనా రాయణ, సిరిగిరి రాజు, గౌతంనగర్, మల్కా జిగిరి డివిజన్ ల అధ్యక్షులు ప్రవీణ్, జీడి సంపత్ గౌడ్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత 'చైనీస్ మాంజా'పై

# పోలీసుల ఉక్కుపాదం..!

- బాలానగర్ డివిజన్లో స్పెషల్ డ్రైవ్ షురూ
- అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు - ఏసీపీ నరేష్ రెడ్డి



కూకట్ పల్లి, మేజర్ న్యూస్: నిషేధిత చైనీస్ మాంజా అక్రమ అమ్మకాలు, పంపిణీని అరికట్టేందుకు సైబరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆదేశాల మేరకు బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో బాలానగర్ డివిజన్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ స్పెషల్ ఆపరేషన్ వివరాలను బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి వెల్లడించారు.

మిగతా 2లో

# మదర్ థెరిసా ఛారిటబుల్ సొసైటీ వారిచే రక్త దాన శిబిరం

● రక్త దానం చేసిన యువకులు ● సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ సేవలను కొనియాడిన వక్తలు





వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃమదర్ థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం వైదేహినగర్ పార్క్‌లో మెగా రక్త దాన శిబిరం జరిగింది. శిబిరాన్ని సిసిఎస్ అడిషనల్ డిప్యూటీ కమీషనర్ గాదరి మనోహర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇతర దానాల కంటె రక్త దానం గొప్పదన్నారు. రక్తదాతలే నిజమైన హీరోలు అన్నారు. రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన చేపూరి శంకర్‌ను ఆయన అభినందించారు. సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కోయి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ చేపూరి శంకర్ గొప్ప సామాజిక కార్యకర్త అని, శంకర్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 7 మెగా రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు.

మదర్ థెరిస్సా ఛారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించి రెడ్ క్రాస్ సొసైటీకి అందజేస్తున్నామన్నారు. దేశంలో రోజుకు 12 వేల మంది తలసేమియా బాధితులు మరణిస్తున్నారని, వారి ప్రాణాలు కాపాడడానికి యువత మందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్ నిమ్స్ యాదయ్య, రిటైర్డ్ నాగర్‌కర్నూల్ సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ మనేజర్ బాలరాజ్, జిహెచ్ఎంసి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తి, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కొలిశెట్టి సంజయ్‌కుమార్, గోల్డెన్ ఫీట్ డెవలపర్స్ డైరెక్టర్ లగ్గోని శ్రీధర్‌గౌడ్, ముల్క ప్రశాంత్, సుబ్రహ్మణ్యం కొటక్ మహేంద్ర బ్యాంక్ డైరెక్టర్, రిటైర్డ్ రెడ్ క్రాస్ తలసీమియా డాక్టర్ రామ సుబ్బారెడ్డి, చేపూరి సునీత, గంజి వెంకటేశం, కార్తీక్, సందీప్, వంశీ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ అమానవీయ ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలి -భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి



అమీర్ పేట,మేజర్ న్యూస్ :మతోన్మాద మూకలు బంగ్లాదేశ్ లో దీప్ చంద్ర దాస్ అనే యువకుడిని బహిరంగంగా ఉరి తీశాయి. అంతేకాకుండా తమ మత అహంకారాన్ని చల్లార్చుకోవడానికి ఆ వ్యక్తిని తగలబెట్టాయి.పరమత సహనం లేకుండా, మతోన్మాదంతో జరిగిన ఈ సంఘటనను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఖండించింది.దీప్ చంద్ర దాస్ కు సంఘీభావంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించింది.సనత్ నగర్ డివిజనులోని నెహ్రూ పార్క్ అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీని ప్రారంభించింది.ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో మైనారిటీలైన ఇతర మతస్తులపై అరాచకాలు,అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మతోన్మాదం వెర్రి తలలు వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరూ పరమత సహనం పాటించాలని చెప్పినందుకు ఆ దేశ మెజారిటీ మతానికి చెందిన వారు దీప్ చంద్ర దాస్ ను కర్కశంగా,మానవత్వం తలదించుకునేలా హత్య చేశారని ఆవేదన వ్యక్తపరిచారు.దేశాలకు,ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఈ దుర్మార్గమైన,దురహంకారపూరిత దుర్ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. మానవత్వానికే మచ్చ తెచ్చే ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ప్రతిఒక్కరూ ఏకతాటిపైకి వచ్చి మతోన్మాద మూకలను తరిమికొట్టాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు సాయిప్రకాశ్, సుధాకర్ ముదిరాజ్, రాజా మిథుల్, కార్తీక్, నరేశ్ ముదిరాజ్,దయానంద్,క్రాంతికుమార్, రాజేశ్, శ్యామ్,కాశీ విశ్వనాథ్,అరుణ్, రమేశ్, కనల్, లాలూ,మధు,సాయి,నాగార్జున తదితరులున్నారు.

# నిషేధిత ‘చైనీస్ మాంజా’పై పోలీసుల ఉక్కుపాదం..!

**మొదటి పేజి తరువాయి :** "బాలానగర్ డివిజన్ పరిధిలో చైనీస్ మాంజా అమ్మకం, వినియోగం, నిల్వ లేదా రవాణాలో పాల్గొన్న వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ చైనీస్ మాంజాను విక్రయించినా, గాలిపటాలు ఎగరేసేందుకు ఉపయోగించినా... సదరు వ్యక్తులకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ప్రతి సంక్రాంతికి ఈ ప్రమాదకరమైన మాంజా కారణంగా ఎంతో మంది మనుషులు చనిపోతున్నారు లేదా తీవ్రంగా గాయపడుతున్నారు. ముఖ్యంగా పక్షులకు, పర్యావరణానికి ఇది తీవ్ర నష్టం కలిగిస్తుంది అన్నారు. పతంగి దుకాణాల యజమానులు పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే, వారు కూడా జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లలకు చైనీస్ మాంజా వాళ్ళ కలిగే నష్టాలను తల్లిదండ్రులు విధిగా వివరించి వారికి అవగాహన కల్పించాలన్నారు. "ప్రజలు దీన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించాలని, చైనీస్ మాంజా విక్రయాలు లేదా నిల్వ గురించి ఏ సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారం లేకుండా ఈ ప్రమాదాన్ని పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదని," ఏసీపీ నరేష్ రెడ్డి ప్రజలను కోరారు.

# ప్రేమను పంచడమే క్రిస్మస్ ఉద్దేశం

## భాయ్స్ టౌన్ స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

చార్మినార్, మేజర్ న్యూస్: ప్రేమను పంచడం, ఆభాగ్యులను పేదలను ఆదుకోవడమే క్రిస్మస్ ప్రధాన ఉద్దేశమని పాతబస్తీ జహనూమా సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఆరోగ్యం ప్రసాల పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితో పనిచేయడమే క్రిస్మస్ సందేశం స్వీకరించడినట్లు అవుతుందన్నారు. సోమవారంనాడు పాతబస్తీలోని జహనూమాలోనున్న సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రార్థనా గీతంతో ఈ వేడుకలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమంలో సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ సౌరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆరోగ్యం ప్రసాల, స్కూల్ డైరెక్టర్ యేసు ప్రభారన్, మీడియా ఇన్ ఛార్జ్ ఓం ప్రకాశ్ దిలీకర్, స్కూల్ సిబ్బంది కల్పనా దేవి శర్మతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హై స్కూల్ వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రిస్మస్ అన్నది కుల, మతాలకు అతీతంగా జరుపుకోవాల్సిన వేడుక అని పేర్కొన్నారు. నేటి సమాజంలో మానవనీయత దిగజారిపోతోందని, ఈ సమయంలో క్రిస్మస్ సందేశం సమాజానికి ఎంతో



అవసరమని ఆయన వెల్లడించారు. ఈ క్రిస్మస్ ను పురస్కరించుకొని పలు రకాల వస్తువులను పేదలకు పంచిపెడుతున్నామని ఆయన వెల్లడించారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అసవరముందన్నరు. భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం మన దేశం గొప్పతనమని వెల్లడించారు. వీటి స్ఫూర్తితో కుల, మతాలకు అతీతంగా ప్రజా సేవ చేయాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు.

## వేడుకగా కళాభారతి వారి సంగీత విభావరి



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃపద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వర్‌రావు 103వ జయంతి సందర్భంగా కళాభారతి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ వారిచే ఆదివారం సాయంత్రం శారదానగర్ పార్కులో సంగీత విభావరి స్థానిక గాయనీ గాయకులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. వై. శివరామ ప్రసాద్, తంగిరాల అరుణ్‌కుమార్, సిహెచ్. శ్రీధర్‌రావు, యాదగిరి, నారాయణరావు, టి. యాదగిరిరావు, రాఘవేంద్ర,రాజేంద్రప్రసాద్, సిహెచ్. ఉష, నివేదిత, చిన్మయి తదితరులు తమ మధురమైన గీతాలతో శ్రోతలను రంజింపచేశారు. శారదానగర్ కాలనీ కార్యదర్శి కె. ఎల్. నరసింహారావు, కళాభారతి సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాధరావు, బి ప్రసన్నాంజనేయులు, సీనియర్ సిటిజన్స్ సభ్యులు డా.ఎస్. అప్పారావు, హనుమంతరావు, బి.జివి ప్రసాద్, ఆర్ సూర్యనారాయణ రావు, ఎఎస్ రావు, విష్ణుమూర్తి, వి.వి శాస్త్రి, సిహెచ్ హరిప్రసాదరావు, ప్రముఖ రంగస్థల నటులు మల్లాది వెంకటరమణ, రాంమోహన్‌రావు, సిహెచ్‌విఆర్‌కె మూర్తి, శర్మ తదితరులు పాల్గొన్నారు. కళాభారతి సంస్థ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి కావస్తున్నదని సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాధరావు తెలియజేశారు.

## శ్రీ వెంకటేశ్వర కాలనీ కొత్త కార్యవర్గం ఎన్నిక

### ప్రజాస్వామ్మ పద్ధతిలో జరిగిన కాలనీ ఎన్నిక

### అధ్యక్ష, కార్యదర్శులుగా పి. రాంబాబు, లక్ష్మణాచారి



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃబిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి సాహెబ్‌నగర్ లోని శ్రీ వేంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ సంఘం (రిజిస్ట్రర్డ్ నెంబర్ 441/2010 ) యొక్క ఎన్నికలు ఆదివారం డిశంబర్ 21 వ తేదీన ప్రజాస్వామ్య విధానంలో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల అధికారుల సమక్షంలో జరిగాయి. ఈ ఎన్నికలలో పాటి రాంబాబుగౌడ్ అధ్యక్షులుగా, మొగుతాళ్ల రాజుగౌడ్ ఉపాధ్యక్షులుగా, మల్లోజు లక్ష్మణాచారి ప్రధాన కార్యదర్శిగా, బొమ్మరాజు శ్రీను కోశాధికారిగా, పద్య జైపాల్ నాయక్ సంయుక్తకార్యదర్శిగా, చింతకాయల లక్ష్మయ్య, రావుల రమేష్ కార్యవర్గ సభ్యులుగా గెలుపొందారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు కాలనీ వాసులందరికి ధన్యవాదాలు తెలుపుతు కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

## రిజర్వాయర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలి




**మొదటి పేజి తరువాయి :**

అందుకుముందు గండిపేట సెక్షన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో గోదావరి ఫేజ్ 2%డ% 3ప్రాజెక్టు లో భాగంగా జన్వాడ లో నిర్మించే వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.అలాగే నియాపోలిస్ వద్ద నిర్మించతలపెట్టిన మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనుల వివరాలు ఆరాతీశారు. జంట జలాశయాల వద్ద నిర్మించతలపెట్టిన ఎస్టీపీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు నీటి సరఫరా చేసేందుకు గానూ జలమండలి ఓఆర్ఆర్ ఫేజ్ – 2 పనులను చేపట్టిన సంగతి తెలిసిందే.

# మిలన్ ఫ్యాషన్ వీక్‌కు హైదరాబాద్ విద్యార్థులు

‘ఎవ్లోవ్-2025’ గ్లోబల్ రన్‌వేలో ఘన విజయం

‘ఆపరేషన్ సింధూర్’ థీమ్‌తో సత్తా చాటిన హిటిమ్స్ అకాడమీ విద్యార్థులు ? ముఖ్య అతిథిగా అంజు మోదీ




జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: అంతర్జాతీయ ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ యువ ప్రతిభ మెరిసింది. ఇటలీలోని మిలన్‌కు చెందిన ప్రతిష్టాత్మక ‘ఇస్టిటుటో డి మోడా బార్గో’ నిర్వహించిన ఎవ్లోవ్ -2025 గ్లోబల్ రన్‌వే (సీజన్ 5) ఫ్యాషన్ షోలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు అద్భుత విజయాన్ని అందుకున్నారు. ఆదివారం న్యూఢిల్లీలోని ‘ది నికుంజ్ రిసార్ట్’లో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. అంజు మోదీ చేతుల మీదుగా ప్రశంసలు: ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ డిజైనర్, సెలబ్రిటీ అంజు మోదీ ముఖ్య అతిథిగా హాజరై, యువ డిజైనర్ల సృజనాత్మకతను అభినందించారు. దేశవ్యాప్తంగా అనేక మంది వర్ధమాన డిజైనర్లు పాల్గొన్న ఈ వేదికపై హైదరాబాద్ విద్యార్థులు తమ వినూత్న శైలితో అందరినీ ఆకట్టుకున్నారు.

దేశభక్తి, సామాజిక స్పృహే థీమ్స్‌గా.. హైదరాబాద్‌కు చెందిన హిటిమ్స్ అకాడమీ నుండి 28 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ రన్‌వేపై తమ డిజైన్లను ప్రదర్శించారు. వీరు ప్రధానంగా రెండు అంశాల నుంచి ప్రేరణ పొంది తమ కలెక్షన్లను రూపొందించారు: 1)ఆపరేషన్ సింధూర్: దేశభక్తిని చాటిచెప్పే శక్తివంతమైన థీమ్. 2)ధూమపాన దుష్ప్రభావాలు: ధూమపానం వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించే థీమ్. మిలన్ ఫ్యాషన్ వీక్‌కు ఎంపిక: హిటిమ్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన ‘ఆపరేషన్ సింధూర్’ థీమ్ ఈ షోలో విజేతగా నిలిచింది. ఈ ఘనతతో వీరు ఇటలీలోని మిలన్‌లో జరగనున్న ప్రపంచ ప్రసిద్ధ ‘మిలన్ ఫ్యాషన్ వీక్’ లో తమ డిజైన్లను ప్రదర్శించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు.

మార్గదర్శకత్వం: హిటిమ్స్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ నిపుణుల మార్గదర్శకత్వంలో, అధ్యాపకులు పరశురాం మరియు దీక్షిత్‌ల సహకారంతో విద్యార్థులు ఈ అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అంతర్జాతీయ వేదికపై తమ విద్యార్థులు సత్తా చాటడం పట్ల అకాడమీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా జాతీయ మ్యాథమెటిక్స్ డే వేడుకలు

జీడిమెట్ల మేజర్ న్యూస్ : 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందన గర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సోమవారం ఘనంగా జాతీయ మ్యాథమెటిక్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన గణిత ప్రదర్శనశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నేషనల్ మ్యాథమెటిక్స్ డే శు భాకాంక్షలను తెలియజేశారు. గొప్ప మ్యాథమెటిషియన్ అయిన శ్రీనివాస రామా నుజన్ జన్మదినం తేదీ డిసెంబర్ 22 సందర్భంగా, నేషనల్ మ్యాథమెటిక్స్ డే ని జరుపుకుంటామని తెలియజేసారు. ఆయన చిన్న వయసులోనే మ్యాథ్స్ ను అందరికీ అర్థమయ్యేలా తీర్చిదిద్దారన్నారు. మన భారతదేశంలోనే నంబర్ వన్ మ్యాథమెటిషియన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్



డైరెక్టర్ తీగల శ్రీశాంత్, ప్రిన్సిపల్ రామారావు, మ్యాథమెటిక్స్ అధ్యాపకురాళ్లు సౌజన్య, నీలవేణి, ప్రత్యూష, శివకుమారి, అధ్యాపకులు పార్వతి, స్వర్ణ, ఫిజికల్ ట్రైనర్ కిరణ్ సాగర్, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

## పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం, కార్పొరేటర్ సబిహాబేగం





అల్లాపూర్, మేజర్‌న్యూస్ : కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్, సఫ్దార్‌నగర్ ఇ బ్లాక్‌లో శ్రీ కట్టమైసమ్మ, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో 41 రోజులు మండల కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబిహాబేగం, మేడ్చల్‌జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దన్ పాల్గొని ఆలయ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణమరాజు, జనరల్ సెక్రటరీ వేణు గోపాల కృష్ణ, సఫ్దార్ నగర్ బస్తీ అధ్యక్షుడు హమీద్, బస్తీ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా రిటైర్డ్ ఆఫీసర్ వెంకటేశం జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు, కాలనీ వాసులు

## పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించిన గద్దె విజయ్‌నేత



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃబిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి ఎన్జీకాలనీలోని రిటైర్డ్ ఎసిపి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మిత్రులు, కాలనీ వాసులు ఆఫీసర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, సామాజిక కార్యకర్త గద్దె విజయ్‌నేత వెంకటేశం పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించి మంచి ఆఫీసర్‌గా పేరొందిన రిటైర్డ్ ఎసిపి అధికారి వెంకటేశం సార్ సేవలను ఈ సందర్భంగా విజయ్‌నేత కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ఓం ప్రకాష్, రిటైర్డ్ జడ్జి త్యాగరాజు, సోమేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, స్నేహితులు, బంధువులు, వాకింగ్ ఫ్రెండ్స్ పాల్గొన్నారు.

## వీల్ చెయిర్‌కు అనుకూల రవాణా సేవలు ప్రారంభం

– జీఎంఆర్‌తో బడి మొబిలిటీ కేర్ భాగస్వామ్యం

– భారతదేశ విమానాశ్రయ చరిత్రలో మొదటిసారి



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: ప్రయాణికులకు సమగ్ర సేవలు అందించడంలో భాగంగా జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో బీష్యూర్ బడి ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బడి మొబిలిటీ కేర్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో భారతదేశ విమానాశ్రయ చరిత్రలో మొదటిసారి వీల్‌చెయిర్‌కు అనుకూల రవాణా సేవలను హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రారంభించారు. దీని ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికులు స్వతంత్రంగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా బడి మొబిలిటీ కేర్ (బీష్యూర్ బడి ప్రైవేట్ లిమిటెడ్) వ్యవస్థాపకురాలు, సీఈఓ సర్తాజ్ లాంబా మాట్లాడుతూ అవసరాలు ఏవైనా కావచ్చు.. ప్రతి ప్రయాణికుడు గౌరవంతో, స్వతంత్రంగా ప్రయాణించే అవకాశం కల్పించడం లక్ష్యమన్నారు. ఈ భాగస్వామ్యం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పునకు దారి తీసే అవకాశం ఉందన్నారు. ఉబుంటు కన్సార్టియం వ్యవస్థాపకురాలు, మాజీ ఐఏఎస్ అధికారి రత్న ప్రభ మార్గదర్శకత్వం, జీఎంఆర్ బృందం అందించిన సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. వీల్‌చెయిర్ ప్రయాణికులకు పూర్తి అనుకూలంగా రూపొందించిన రవాణా వాహనాలు అన్నారు. ప్రయాణికులకు వ్యక్తిగతంగా సహాయం అందించే నిపుణులైన సిబ్బంది ఉన్నారన్నారు. ప్రతి ప్రయాణికుడి సురక్షితమైన, విశ్వసనీయమైన, మానవీయ సహకారంతో కూడిన ప్రయాణం లక్ష్యమన్నారు.

## పాలకులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : పాతకాల పద్ధతిలో పాలకులు వ్యవస్థలను నడుపుతూ, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని శ్రమ శక్తి ఫౌండేషన్ ఫౌండర్ కె రాంబాబు తెలిపారు. ఈ మేరకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ, భారతీయ న్యాయ సంహిత (బి) వచ్చాక మన ఆలోచనల్లో మార్పు రావాలని అన్నారు. వీటిపై అధికారులకు సైతం అవగాహన లేదని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ నాయకులు ఈ విషయంలో స్పందించాలని అన్నారు. ఆర్థిక వ్యవస్థ కేంద్రం ఆధీనంలో సామాజిక వ్యవస్థలు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సంహిత పేరుతో ఒక పబ్లిక్ ప్లాట్ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సభ్యులుగా ఉండాలని ఆయన సూచించారు. ఇలాంటి వ్యవస్థల ద్వారా సామాన్యులు సైతం తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు అనువుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## శ్రీ కృష్ణానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణానగర్ లో (ఎస్టిపి ప్లాంట్ వెనుక) 12 లక్షల రూపాయల అంచ నా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ నగర్ లో దాదాపు అన్ని ప్రదేశాల్లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, రమేష్, సంజీవ, శరత్, ప్రసాద్, బాలేష్ రవి, నరేందర్ రెడ్డి, నాని, మురళి గౌడ్, నందు యాదవ్, మండల్, మాధవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యం : సీనియర్ ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ





దుండిగల్ మేజర్ న్యూస్ : సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యమని, సామాజిక అసమానతలను తొలగించడానికి విద్య ఒక ముఖ్యమైన ఆయుధమని, విద్య వ్యక్తికి జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించి, సామాజిక సమస్యలను పరిష్కరించే శక్తిని ఇస్తుందని సీనియర్ ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ అన్నారు. ఆదివారం పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు బాచుపల్లిలోని కార్తికేయ క్రికెట్ గ్రౌండ్స్ లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఏన్ హెలిస్ టర్నింగ్ ది వీల్స్ అఫ్ టైం (కాలచక్రాన్ని తిప్పుతూ?) అనే ఆలోచనాత్మక థీమ్‌తో నిర్వహించబడింది. ఈ వేడుకలకు సీనియర్ ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన తన ప్రసంగంలో ఉత్తమమైన విద్యా వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, సమగ్ర విద్యను అందిస్తున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌ను అభినందించారు. మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సాంద్ర అతిథిగా పాల్గొని, తల్లిదండ్రులను తన ప్రేరణాత్మక ప్రసంగంతో ఉత్సాహపరిచారు. నూతన విద్యా విధానాల అమలులో పల్లవి స్కూల్స్ చేస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మరో అతిథిగా ప్రఖ్యాత కూచిపూడి నర్తకి, సీసీఆర్టీ అధికారి సౌందర్య కౌశి పాల్గొని, విద్యార్థులను సాంస్కృతిక కళల్లోనూ రాణించాలంటూ ప్రోత్సహించారు. పాఠశాల డైరెక్టర్ సుశీల్ వార్షికోత్సవ థీమ్ ప్రాముఖ్యతను సంక్షిప్తంగా వివరిస్తూ ప్రసంగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధేశ్న మిరాల్ అతిథులకు, తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. విద్యార్థులు వివిధ నృత్యాలు, గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రేక్షకులను అలరించారు. పిల్లలు పూర్తి ఆనందంతో ప్రదర్శనలు ఇవ్వగా, వాటి ద్వారా థీమ్‌ను అద్భుతంగా ఆవిష్కరించారు. తల్లిదండ్రులు, తాతామ్మలు పెద్ద సంఖ్యలో హాజరై, తమ పిల్లల ప్రదర్శనలను ఆస్వాదిస్తూ ఈ వేడుకలను మరింత ఆనందదాయకంగా మార్చారు. ఈ వార్షికోత్సవ వేడుకలు విద్య, సంస్కృతి, సమగ్ర అభివృద్ధికి పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ కట్టుబాటును మరోసారి చాటిచెప్పాయి.

# గాదె ఇన్నయ్యను బేషరతుగా విడుదల చేయాలి



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : అక్రమంగా అరెస్టు చేసిన తెలంగాణ ఉద్యమకారుడు , భారత్ బచావో ఉద్యమ నేత గాదె ఇన్నయ్యను బేషరతుగా ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం హైదర్గూడా ఎన్ఎస్-ఎస్ భవనంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం నారాయణ రావు నాయకులు హనుమంతురావు, బాలకృష్ణ లతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు. పౌర హక్కుల పరిరక్షణ కోసం మాట్లాడుతున్న ఇన్నయ్య వంటి వ్యక్తులపై ఉపా చట్టాన్ని ప్రయోగించడం తగదని హెచ్చరించారు. ఆపరేషన్ కగారుపై తన అభిప్రాయాన్ని చెప్పడం నేరమా అని ప్రశ్నించారు. దేశంలో పాలకులు ఎన్ఐఏ (కేంద్ర దర్యాప్తు సంస్థ) వంటి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని పౌరులపై తమ నిరంకుశత్వాన్ని ప్రదర్శించడం తగదని ఆయన అన్నారు.

# శేరిలింగంపల్లి జర్నలిస్టుల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు

- టీయూడబ్ల్యూజే నాయకులు
- చందానగర్‌లో ఘనంగా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం













శేరిలింగంపల్లి,జ్యోతిన్యూస్ : దశాబ్దాలుగా శేరిలింగంపల్లి జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సొంతింటి కల సకారం దిశగా అడుగులు పడుతున్నాయని టియుడబ్ల్యూజే నాయకులు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో సోమవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విట్టల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సగరలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అండదండలతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో చందానగర్ లో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం 1 ఎకరా స్థలాన్ని కేటాయించిందని అన్నారు. సదరు స్థలంలో జర్నలిస్టులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు టియుడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ ల ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా ఈ స్థలం పక్కనే ఉన్న మరో ఎకరా స్థలం మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన ఘనత తమదని.. ఎక్కడా లేని విధంగా అక్రిడేషన్ కార్డులను పెంచి వర్కింగ్ జర్నలిస్టులకు గుర్తింపు కార్డులను అందజేశామని అన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కాలపరిమితి ముగిసి 20 నెలలు గడుస్తున్నా రెన్యువల్ చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టియుడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మండల పూజలో పాల్గొనాలని నవీన్ యాదవ్‌కు ఆహ్వానం



ఎర్రగడ్డ , మేజర్ న్యూస్. 17 వార్షికోత్సవం సందర్భంగా బోరబండ డివిజన్ ఎన్ఆర్ఆర్ పురం సైట్ 2లో గల శ్రీహరిహర పుత్ర అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న అయ్యప్ప మండల పూజలో ముఖ్యఅతిథులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు జూబ్లీహిల్స్ నియోజకవర్గం శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్‌కు ఆహ్వాన ప్రతికను అందజేశారు. ఈ మేరకు వారు నవీన్ యాదవ్‌ను తన నివాసం వద్ద శాలువాతో ఘనంగా సత్కరించి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా అభినందనలు తెలుపుతూ మండల పూజకు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యావస్థాపక అధ్యక్ష్యులు జి.లక్ష్మణ్ గౌడ్, సభ్యులు తివారి, నాని, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న పద్యానాటకం



రహ్మత్‌నగర్ , మేజర్ న్యూస్.. తన తండ్రి స్వర్గీయ తన్నీరు వెంకటేశ్వర్లు 25వ వర్ధంతి సందర్భంగా కుమారులు ఏడుకొండలు, సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పద్యనాటకం తన్నీరు కుటుంబసభ్యులు, స్థానిక ప్రజలను తీవ్రంగా ఆకట్టుకుంది. ఈ మేరకు డివిజన్ పరిధిలోని ఓంనగర్‌లో నవ క్రాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ఆదివారం నిర్వహించిన భక్త ప్రహ్లాద పౌరాణిక పద్యనాటకం చూపరులను మంత్ర ముగ్ధులను చేసింది. అనంతరం బస్తీ నేతలు కళాకారులను ఘనంగా సత్కరించి పౌరాణిక కళలు అంతరించి పోకుండా పద్యనాటకాల ద్వార ప్రజలకు చరిత్రను గుర్తు చేస్తున్న మీరు అభినందనీయులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు లీడర్ నర్సింహా, రాంబాబు, వేముల వెంకటేష్ , రావి పాండురంగారావు, నాటకం దర్శకులు యం.అర్జున్ రావు, కళాకారులు తన్నీరు ఏడుకొండలు, అర్జున్ రావు, శ్రీరాం, గాబ్రియేలు, నారాయణస్వామి, శ్రీనివాస్, గురునాథచారి, పొన్నాడ అంజనేయులు, చారి, చక్రవర్తి, వెంగమాంబ , సురభి ప్రియాంక, మణిశ్రీ, సాంకేతిక సహాయకులు భాస్కర్, బ్రహ్మం, అనిల్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సంబంధించిన కార్పొరేషన్ చైర్మన్‌లను నియమించాలి

**తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షులు గుంటి నగేష్**



హైదరాబాద్, మేజర్ న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ లో ఉన్న చేనేత సమస్యలను పరిష్కరించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ విభాగం అధ్యక్షులు గుంటి నగేష్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వము మన యొక్క నాలుగు కార్పొరేషన్లు పూర్తి చేయలేదన్నారు. చేనేతకు సంబంధించిన టెక్స్టైల్ కార్పొరేషన్, పవర్ లూమ్ కార్పొరేషన్, ?హ్యాండ్లూమ్ కార్పొరేషన్,?పద్మశాలి క్యాస్ట్ కార్పొరేషన్ పద్మశాలి కులస్తులనే వెంటనే ప్రభుత్వం భర్తీ చేయాలని నియమించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి తెలియజేయటానికి ఏర్పాటు చేయడం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వచ్చే ఎన్నికలలో అంటే ఎంపిటిసి, జడ్పిటిసి మరియు మున్సిపల్ ఎన్నికలలో మన యొక్క అభ్యర్థులని ఎంపిక మరియు రాజకీయ శిక్షణ తరగతులను ఏర్పాటుకు అదే విధంగా గెలిచినటువంటి పద్మశాలీలకు సన్మాన కార్యక్రమానికి ఏర్పాట్లకై చర్చ కార్యక్రమం చర్చించడం జరిగిందన్నారు.

# పేదల పెన్నిధి..రొయ్యల కృష్ణమూర్తి పోరాటం స్ఫూర్తిదాయకం

## ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పలువురు నేతల ఘన నివాళి



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : అనేక మంది నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించి, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ సీనియర్ నేత రొయ్యల కృష్ణమూర్తి చేసిన రాజీ లేని పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి మౌలాలి డివిజన్ పరిధిలోని భరత్ నగర్ లో సామాజిక సేవా కార్యకర్త బత్తిని నర్సింహా గౌడ్ ఆధ్వర్యంలో రొయ్యల కృష్ణ మూర్తి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు హజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ యువజన నాయకుడు స్థాయి నుండి కృష్ణ మూర్తి అంచెలంచెలుగా ఎదిగా రని, సీపీఐ పార్టీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఆయన అనేక కీలక పదవులు అలరించారని తెలిపారు. పార్టీలకతీతంగా పని చేసి పేదల పెన్నిధిగా, అజాత శతృవుగా మల్కాజిగిరి ప్రజల హృదయాల లో కొలువై ఉన్నారని ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. నిరంతరం పేద ప్రజల సమ స్యల పరిష్కారం కోసం ఆయన తపించా రని, భూ పోరాటం, స్థానిక సమస్యలపై నిర్వ హించిన అనేక ప్రజా ఉద్యమాలలో కృష్ణమూ ర్తి చురుకుగా పాల్గొనే వారన్నారు. తన తుది శ్వాస విడిచే వరకు ప్రజల కోసం ఆయన పోరాడారని, మల్కాజిగిరి ప్రజలకు అమూ ల్యమైన సేవ లందించారని వారు కొనియా డారు. వినాయక్ నగర్, జవహర్ నగర్ లోని డెంటల్ కాలేజ్, కీసర భూదాన పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించి పేదలకు ఇళ్ల స్థలా లు ఇప్పించిన ఘనత కృష్ణమూర్తికి దక్కు తుందని ఆయన సేవలు మరువ లేనివని వక్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి రొయ్యల గిరిజ, కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ అధ్య క్షుడు పోతుల వినోద్ యాదవ్, సీనియర్ నేత సిలుముల కృష్ణ,వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నేత , తెలంగాణ ఉద్యమకారుడు తోట నాగేష్,మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్య క్షుడు జోగు శ్రీనివాస్, భరత్ నగర్ కాలనీ అధ్యక్షుడు మందభాస్కర్, బీసీ సంఘాల నాయకులు బత్తిని నరసింహగౌడ్ కామల్ల ఐలన్న, కాసర్ల నాగరాజు, పిట్టల భాస్కర్, పేపర్ శ్రీను, ఎస్. కె అజీజ్, చెరుకు సాంబరా జు, కె.సంపత్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా 'తెలంగాణ ఫిలిం ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అండ్ మేనేజర్స్ అసోసియేషన్' ఎన్నికలు

## 2025-27 కాలానికి నూతన కార్యవర్గం ఎన్నిక ? అధ్యక్షుడిగా కె. లక్ష్మణ్ రావు, గౌరవ అధ్యక్షుడిగా సీతారామ్ యాదవ్



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్: తెలంగాణ ఫిలిం ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మరియు మేనేజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జూబ్లీహిల్స్‌లో అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించబడ్డాయి. 2025 నుండి 2027 వరకు రెండేళ్ల కాలానికి జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియ లీగల్ అడ్వైజర్ మరియు ఎలక్షన్ ఆఫీసర్ కేవీఎల్. నరసింహారావు (అడ్వకేట్) పర్యవేక్షణలో సజావుగా సాగింది. ప్రతి పదవికి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో నూతన కార్యవర్గ సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా సీతారామ్ యాదవ్ (రవివర్మ), అధ్యక్షుడిగా కె. లక్ష్మణ్ రావు, జనరల్ సెక్రటరీగా సిహెచ్. లతీఫ్, మరియు కోశాధికారిగా పి. రవి కుమార్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం. బానయ్య, టి. యాదగిరి గౌడ్; జాయింట్ సెక్రటరీలుగా ఏ. బాలరాజు, నిమ్మల అశోక్; ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.శ్రీరాములు, ఎం. శ్రీనివాస్ రావు (గడ్డం శ్రీను), యు. మధుబాబు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా బి. బలరాం ప్రసాద్, బి. సుధాకర్, ఎనుముల రవి (పద్మాలయ), జి.వి. రాజేందర్ రెడ్డి, కె. లక్ష్మణా చారి, పి. వెంకటేష్, తగిగేళ్ళ రవి (అర్క), వి. మురళి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సభ్యులందరి ఏకాభిప్రాయంతో నూతన బాడీ ఎన్నిక కావడం అసోసియేషన్ ఐక్యతకు నిదర్శనమని ఎలక్షన్ ఆఫీసర్ పేర్కొనగా, రాబోయే రెండేళ్లలో మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నూతన అధ్యక్షులు కె. లక్ష్మణ్ రావు, గౌరవ అధ్యక్షులు సీతారామ్ యాదవ్ హామీ ఇచ్చారు.

# జ్ఞానం ఉనికికి అర్థాన్ని ఇస్తుంది

## గీతంలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవంలో ప్రొఫెసర్ కన్నన్



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: జ్ఞానం ఉనికికి అర్థాన్ని ఇస్తుందని, మానవులను అన్ని ఇతర జాతుల నుంచి వేరు చేస్తుందని ప్రొఫెసర్ శ్రీనాథన్ కన్నన్ వ్యాఖ్యానించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత, గణాంక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుకల ను ప్రారంభించారు. జ్ఞానం జీవితాన్ని సౌకర్యవంతంగా చేయడమే కాకుండా నాగరితను నిలబెట్టి మానవాళిని శాశ్వతంగా ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉందని డాక్టర్ కన్నన్ నొక్కి చెప్పారు. మానవ జ్ఞానం నాగరికతకు, విశ్వాసానికి రెండింటికీ ఉద్దేశ్యాన్ని ఇవ్వగల అత్యంత శక్తివంతమైన సాధనంగా ఆయన అభివర్ణించారు.'పూర్ణాంక కారకం, ఫోరియర్ పరివర్తన, క్వాంటం అల్గోరిథంలు' అనే అంశంపై ప్రొఫెసర్ కన్నన్ ఉపన్యసించారు. క్వాంటం ఫ్యాక్టరింగ్ లో ఉన్న కీలక దశలను ప్రొఫెసర్ శ్రీనాథన్ కన్నన్ వివరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా సభాధ్యక్షత వహించి, అతిథిని సత్కరించారు. కార్యక్రమ లక్ష్యాన్ని గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ వివరించారు. గణిత శాస్త్ర ఆలోచన మానవ డీఎన్ఏ, సంస్కృతిలో లోతుగా పొందుపరచబడిందని ప్రొఫెసర్ వంశీ కృష్ణ నార్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి సమన్వయం చేయడంతో పాటు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కుమ్మరి, విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర దీప, సుష్మిక తదితరులు పాల్గొన్నారు. ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై, ఈ వేడుకలకు మరింత శోభను జోడించారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరుచి కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్



కర్మన్‌ఘాట్, మేజర్ న్యూస్ : రాఘవేంద్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో సోమవారం కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజ్గిరి ఎంపీ నిధులు 10 లక్షల ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తికానందున మరో 25 లక్షల రూపాయలు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.కాలనీలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,సతీష్ గౌడ్,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# చంపాపేట్ డివిజన్ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

## కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి



కర్మన్‌ఘాట్, మేజర్ న్యూస్ : చంపాపేట్ డివిజన్ పరిధి సాయిరాం నగర్ కాలనీ, పటేల్ నగర్, శిఖర ఎంక్లేవ్ దాదాపు 56.00 లక్షల రూపాయలతో సీసీ రోడ్ పనులకు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రాధాన్యత అని, ముఖ్యంగా బస్తీలు మరియు కాలనీల్లో రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో చంపాపేట్ డివిజన్‌ను మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఏ.ఈ సురేష్, బిజెపి చంపపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు లింగాల దశరథ్ గౌడ్, జగదీశ్ రెడ్డి, నారాయణరెడ్డి, శిఖరా ఎంక్లేవ్ కాలనీవాసులు వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, కృపాచారి, ఉపేందర్ రెడ్డి, చంద్ర శేఖర్, సాయిరాం నగర్ కాలనీ అధ్యక్షులు జైహింద్ రెడ్డి, కాలనీ వాసులు మురళీకృష్ణ రెడ్డి, నారాయణరెడ్డి, సృజన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్స్ ఔట్ లెట్ ప్రారంభించిన సినీ నటుడు ఆలీ



హిమాయత్ నగర్ ,మేజర్ న్యూస్ : 2013 నుంచి ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్స్ నగరంలో రూ. 1కే గ్రాము ఆర్గానిక్ ఐస్ క్రీమ్ అందించే కొత్త ఔట్ లెట్ ను చందానగర్ లో సినీ నటుడు ఆలీ చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్స్ ఫౌండర్ సుహాస్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతమంతా విస్తరించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, ఇందులో భాగంగా విజయవాడలో కూడా బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో త్వరలో మరిన్ని స్టోర్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సినీ నటుడు అలీ మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఐస్‌క్రీమ్ అంటే ఇష్టమని, తన తల్లికి సీతాఫల్ ఐస్‌క్రీమ్ చాలా ఇష్టమని తెలిపారు. ఐస్‌బర్గ్ మరింత అభివృద్ధి చెందాలని, మరిన్ని ఔట్‌లెట్లు ప్రారంభించాలని ఆకాంక్షించారు.

# హస్తినాపురంలో బంగ్లాదేశ్ దాడులకు నిరసనగా బిజెపి కార్యకర్తలు నిరసన కార్యక్రమం



కర్మన్‌ఘాట్, మేజర్ న్యూస్ : బంగ్లాదేశ్ లో జరిగిన ఘటనను వ్యతిరేకిస్తూ హస్తినాపురం డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఉన్న కొన్ని పార్టీలు సెక్యులర్ ముసుగులో హిందూ సమాజానికి వ్యతిరేకంగా ఇస్లామిక్ తీవ్రవాదానికి సహకరిస్తూ, పెంచి పోషిస్తూ పోరుగున ఉన్న దేశాల సహకారంతో ప్రపంచంలో ముఖ్యంగా బంగ్లాదేశ్ లో తీవ్రమైన దాడులు చేస్తున్నారు. కొన్ని పార్టీలు ఒక వర్గానికి సహకరిస్తూ అధికారమే పరమ అవధిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రానున్న బల్దియా ఎలక్షన్లో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పార్టీలకు గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. బంగ్లాదేశ్‌లో గత కొన్ని సంవత్సరాలుగా హిందువులపై కొనసాగుతున్న హింసాత్మక దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా నిన్న ఒక హిందువును సజీవ దహనం చేసిన అమానుష ఘటన మానవత్వాన్ని కలచివేసింది. ఈ ఘటన బంగ్లాదేశ్‌లో హిందువులు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాజాశ్రీనివాస్ నగర్ కాలనీలో ఆర్ సీసీ పైప్ లైన్ వేయిస్తా
### కార్పొరేటర్ సునీత రాముయాదవ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : గౌతంనగర్ డివిజన్ పరిధి లోని రాజాశ్రీనివాస నగర్ కాలనీలో ఆర్ సీసీ పైప్ లైన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటానని స్థానిక కార్పొ రేటర్ మేకల సునీత రాముయాదవ్ హామినిచ్చారు. సోమ వారం ఆమె, మల్కాజిగిరి సర్కిల్ అధికారులతో కలిసి ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రాజా శ్రీనివాస్ నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ఆర్ సిసి పైపులైన్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ మాట్లాడుతూ రాజాశ్రీనివాస్ నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే ఈ కాలనీలో ఆర్సీసీ పైప్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె, సర్కిల్ ఏఈ దివ్య జ్యోతిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయ కులు మేకల రాముయాదవ్, నర్సింగ్ రావు, కిట్టు, కాలనీ వాసులు పాల్గొన్నారు

## ఇందిరానగర్ లో సెమీ క్రిస్మస్ వేడుకలు పాల్గొన్న విజయారెడ్డి



జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్; జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్ లో జియాన్ చర్చ్ లో సెమి క్రిస్మస్ వేడుకలలో ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పి విజయ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్ పాల్, పాస్టర్ డేవిడ్ పారడైజ్ సాల్మన్ రాజ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ యాదవ్, బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఎనిమిది బాల సాహిత్య కథల పుస్తకాల ఆవిష్కరణ




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ , బాలచెలిమి మాసపత్రిక సంయుక్త నిర్వహణలో 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025 కొంపెల్లి వెంకట్ గౌడ్ వేదికలో 8 బాలసాహిత్య కథల పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. బాలచెలిమి సంపాదకులు మణికొండ వేద కుమార్ అధ్యక్షత వహించగ వేదకుమార్ మాట్లాడుతూ, పిల్లల నైపుణ్యాలను వెలికి తీసి వాటిని బాలచెలిమి పత్రికలో ప్రచురిస్తున్నాం అన్నారు. ముఖ్య అతిథి శాంతా సిన్హా మాట్లాడుతూ ఈ చిన్న పుస్తకాలు రావడం వెనక వేలాది మంది కృషి ఉందన్నారు. సోషల్ మీడియాకు పోటీగా బాల సాహిత్యాన్ని పెడుతున్నామన్నారు. ఈ సందర్భంగా వేదకుమార్ కృషిని అభినందించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు పుస్తకాలను విశ్లేషిస్తూ బాగున్న కథలను, ఎనిమిది పుస్తకాలు మూడు తరాలకు సారథ్యం వహిస్తాయన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల కిందటి కంటే ఈనాడు బాల సాహిత్యం విరివిగా నాణ్యంగా వస్తోంది అన్నారు. బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్ బాలాచారి వేదికను పంచుకున్నారు. చివరగా అతిథులకు ఆత్మీయులకు శాలువాలతో సత్కారం, బాలచెలిమి పుస్తకాల కిట్లను ప్రధానం చేశారు. బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బివిస్ రాములు, చొక్కాపు వెంకటరమణ, ఆర్ వెంకటరెడ్డి రామ్ రాజ్, అమరవాది నీరజ, పైడిమర్రి గిరిజ, వి ఆర్ శర్మ, బాలసాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 8 బాల చెలిమి పుస్తకాలు ఆవిష్కరణ!



ముషీరాబాద్,మేజర్న్యూస్ : చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ ,బాలచెలిమి మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఎనిమిది బాలసాహిత్యకథల పుస్తకాల ఆవిష్కరణ బుక్ఫెయిర్లో నిర్వహించారు. బాలచెలిమి-సంపాదకులు మణికొండ వేదకుమార్, శాంతాసిన్హా,డాక్టర్ రఘు(అసోసియేట్ ప్రొఫెసర్), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి,యాకూబ్(బుక్ఫెయిర్అధ్యక్షులు),బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ -అతితులుగా పాల్గొన్నారు. బాలచెలిమి గ్రంథాలయాలు 41 స్థాపించామని, 100స్థాపించబోతున్నామని వేదకుమార్ తెలిపారు. బాలచెలిమిలో బాలల కథలు, పోటీలు ఉంటాయన్నారు.

## కేఫ్ ప్రారంభం



ఓంకిరణ్,మౌనిష్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ నేతాజీనగర్లో నూతనంగా ఇరానీ హౌస్ కేఫ్ ను ఏర్పాలు చేసారు. ఈ కేఫ్ను రిబ్బన్ కట్ చేసి ముషీరాబాద్ ఎమ్మెల్యేముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్కుమార్ పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్రెడ్డి పాల్గొన్నారు. **-ముషీరాబాద్,మేజర్న్యూస్**

## 'ప్రాజెక్టుల కేటాయింపు బీజేపీ పుణ్యమే'-గీతామూర్తి



ముషీరాబాద్,మేజర్న్యూస్ : తెలంగాణ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన ప్రెస్మీట్ పై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు ,మాజీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి తీవ్రంగా స్పందించారు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో ప్రాజెక్టులు కేంద్ర బీజేపీ సర్కార్ కెటాయించిందన్నారు. కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు చేసిన్నట్లుగా తెలంగాణ కు కూడా చేసిందని ఆమె అన్నారు. కేసీఆర్ వల్లే తె లంగాణ ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆమె గుర్తుచేసారు. కాంగ్రెస్ కు పోటీ బీజేపీనే అన్నారు ,.కేసీఆర్ను ప్రజలు మరచి పోయారని తెలిపారు.

## ఆర్ఎస్ఎస్ దేశం కోసం పనిచేస్తుంది



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : శత వసంతాల ఆర్ఎస్ఎస్ దేశం కోసం పనిచేస్తుందని ముఖ్య అతిథులు అన్నారు. ఈ మేరకు కాచిగూడ జూనియర్ ప్రభుత్వ కళాశాలలో యువ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేజర్ ఎస్ పి ఎస్ ఒబేరాయ్, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచార శ్రీరామ్ భరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత పాత్ర కీలకమని అన్నారు. సంఘం కార్య విస్తరణ, దృఢీకరణ ,వ్యక్తి నిర్మాణం కోసం ఈ యువ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిమాయత్ నగర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లైబ్రరీ స్టాల్!!




ముషీరాబాద్,మేజర్న్యూస్ : పౌర గ్రంథాలయ సంస్థ స్టాల్ బుక్ఫెయిర్లో ఏర్పాటు చేసారు. నగర గ్రంథాలయ సంస్థ సిటీసెంట్రల్ లైబ్రరీలో అంధులకోసం ఏర్పాటుచేసిన బ్రెయిలీలిపిలో ఉన్న పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.పద్మజ, లైబ్రేరియన్లు వరప్రసాద్,ప్రశాంతి పాల్గొన్నారు.పెద్దూరి వెంకటదాసు రచన (గవాక్షం), మౌనశ్రీమల్లిక్ (చలన కాంక్ష ), తో పాటు విమలసాహితీ కి చెందిన పలువురు కవులు, కవయిత్రులు రాసిన పుస్తకాలను ప్రత్యేక స్టాల్లో ప్రదర్శనకు ఉంచారు.

## సృజనాత్మక ప్రాజెక్టులతో సైన్స్ఫెయిర్!



ముషీరాబాద్,మేజర్న్యూస్ : విద్యార్థులు ప్రదర్శించిన ఇస్రో, ఐటీ ,సోలార్ ప్రయోజనాలు- ప్రాజెక్టులు ,ప్లానిటోరియం వీడియో విశేషంగా అలరించాయి. శిల్పారామం గ్రామీణ జీవితాన్ని చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు.ఇస్రో పై బుర్రకథ,మ్యాజిక్షోలు సమ్మోహనంగా సాగియి.చిన్నారులు మార్కెట్ మినీమార్కెట్ను సృష్టించారు, పక్షులు, జంతువుల వేషధారణతో చిన్నారులు సందడి చేసారు.పలు రసాయనిక ప్రయోగాలు చేసారు. అగ్నిపర్వతాన్ని ప్రదర్శించారు.గుండె ఎలా పనిచేస్తుందో చెప్పిన ప్రదర్శన విజ్ఞానాన్ని పంచింది. ...ఇలా చిన్నారులు మనల్ని సైన్స్, విజ్ఞానలోకంలోకి తీసుకువెళ్లారు. ఈ విజయవంతమైన సైన్స్ ఫెయిర్ -స్ప్రింగ్డేల్స్ స్కూల్ బాలలు ప్రదర్శించారు.పేరెంట్స్ పాల్గొని బాలలను అభినందించారు.తమకు ఇష్టమైన ప్రాజెక్టుకు ఓటు వేసారు. అన్ని ప్రాజెక్టులు బావున్నాయిని పేరెంట్స్ కితాబు ఇచ్చారు.

## శ్రీవేంకటేశ్వర స్తోత్రమంజరి ,రఘుశ్రీ హైకూలు -ఆవిష్కరణ!



ముషీరాబాద్,మేజర్న్యూస్ : శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రెండు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. డా.వేదాంతం ఆంజనేయ కురమారస్వామి రచించిన శ్రీవేంకటేశ్వర స్తోత్రమంజరి-శ్లోకాలకు బండారుపల్లి రామచంద్రరావు అనువాదంతో తీసుకువచ్చారు. తెలుగు అనువాదం బండారుపల్లి రామచంద్రరావు అందించారు. శ్లోకాలు,భావాలను కలుపుకుని శ్రీవేంకటేశ్వర స్తోత్రమంజరి-పుస్తకంగా విడుదలైంది.రఘుశ్రీ రచించిన హైకూలు పుస్తకం కూడా ఆవిష్కరించారు. డా.కేవీరమణాచారి(రిటైర్డ్ ఐఏఎస్) పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితలను అభినందించారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై శ్లోకాలు ,అనువాదాలు రావడం అభినందనీయమన్నారు. హైకూలు, నానీలు కాకుండా వచన కవిత్వం రాయాలని రఘుశ్రీకి డా.కేవీ సూచించారు. సమాజప్రయోజనంకోసం కవిత్వం ఉండాలని పేర్కొన్నారు కడియాల ప్రభాకర్, జంధ్యాల వెంకటరామశాస్త్రి అతిథులుగా హాజరయ్యారు. నర్మదారెడ్డి, ,టీవీస్వామి, అపర్ణ,డా.సాంబమూర్తి,వై.శ్రీలక్ష్మి,, గుళ్ళపల్లి ఆంజనేయులు, విజయభారతి(కవిసమ్మేళనం నిర్వహణ) తదితరులు పాల్గొన్నారు. కవులను, జర్నలిస్టులను ఈ సందర్భంగా సత్కరించారు. పలు శ్లోకాలను, హైకూలను చదవి విన్పించారు డా.కేవీ.

# ఇంజనీరింగ్ రంగంలో 'ఎస్కీ' ప్రస్థానం అమోఘం

- ఎస్కీ స్టాల్‌ను ప్రారంభించిన యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్
- దుర్గాపూర్‌లో ఘనంగా ముగిసిన 40వ ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్
- యూనివర్సిటీ హెూదా కోసం తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు : డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు





హైదరాబాద్ మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి): సుమారు నాలుగు దశాబ్దాల కింద హైదరాబాద్ లో స్థాపించబడిన ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ సంస్థలో స్వయం ప్రతిపత్తి , తో పనిచేస్తున్న ఏకైక శిక్షణ సంస్థగా ఆసియాలోనే పేరు ప్రతిష్టలు సాధించిందని, పలు ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించిన మేనేజిమెంట్ టెక్నాలజీ, పవర్ అండ్ ఎనర్జీ, సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్, ఐటీ, క్వాలిటీ ప్రొడక్టివిటీ తదితర అనేక డివిజన్స్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బందికి కాకుండా బాంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక తదితర దేశాల్లో పనిచేస్తున్న ఇంజనీర్స్ కు కూడా నిపుణులైన ఫ్యాకల్టీలతో ఇప్పటికే వేలాది మందికి శిక్షణ ఇచ్చినట్లు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. పశ్చిమ బెంగాల్ లోని దుర్గాపూర్ లో గత మూడు రోజులుగా జరిగిన 40వ ఇండియన్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ సమావేశాలు ఆదివారం 21 డిసంబర్ న ముగిసాయి. ఎస్కి నుండి పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు ఈ మూడు రోజుల సమావేశంలో పాల్గొని గత నాలుగు దశాబ్దాల కాలంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా సాధించిన విజయాలను సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ స్టాల్ ను సమావేశానికి విచ్చేసిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ వీబీ సింగ్, కిర్లోస్కర్ గ్రూప్ చైర్ పర్సన్ సంజయ్ కిర్లోస్కర్, ఐ ఈ ఐ ప్రెసిడెంట్ ఎలక్ట్ మనీష్ మహేంద్ర కొఠారి పలువురు సీనియర్ ఇంజనీర్స్ కలిసి ప్రారంభించారు. మినిస్ట్రీ అఫ్ రోడ్స్ అండ్ హై వేస్ సహకారంలో ఎస్కీ లోని సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ డివిజన్ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణలో రవాణా రంగంలో పనిచేస్తున్న సీనియర్ ఇంజనీర్స్, సీనియర్ పోలీస్ అధికారులకు లేటెస్ట్ టెక్నలజీపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ పవర్ సహకారంతో డిస్కం లో పనిచేస్తున్న వేలాది మంది ఇంజనీర్స్ కు పవర్ సెక్టార్ లో వస్తున్న నూతన టెక్నాలజీలపైన శిక్షణ ఇస్తున్నట్లు రామేశ్వర్ రావు ఈ సందర్భంగా ప్రతినిధుల హర్షద్వానాల మధ్య తెలిపారు. ఎస్కీ లోని ప్రాజక్టు డివిజన్ పలు నిర్మాణ సంస్థలకు కన్సల్టెన్సీ గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాను యూనివర్సిటీ స్థాయికి పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కృషి చేస్తున్నట్లు, తెలిపారు. ఇందువలన ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా స్థాయి మరింత పెరుగుతుందన్నారు. సమావేశంలో దేశంలోని అన్ని ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా చాప్టర్స్ ప్రతినిధులతో పాటుగా రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ సీరం సత్యనారాయణ, రమణ నాయక్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి మర్రి రమేష్ తదితరులు హాజరయ్యారు.

# ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బాషా



కూకట్ పల్లి మేజర్ న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ప్రజలకు అండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మనసున్న మారాజుగా నిలిచారని బాషా అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు కూకట్ పల్లి, కేపిహెచ్ బి కాలనీ 9 వ ఫేజ్ లో గల ప్రెస్ కార్యాలయం వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, హాస్టల్ నిర్వాహకులు బాషా కాలనీ వాసులతో కలిసి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "జగన్ అన్న జిందాబాద్", "వైఎస్ఆర్‌సీపీ జిందాబాద్", జై జగన్ జై జై జగన్ అంటూ నినాదాలతో వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో అమలైన అనేక సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, 108 వాహనాలు తదితర పథకాలను పునర్జీవం పోసారు. అంతే కాకుండా గ్రామ, వార్డు సచివాలయాలు ప్రవేశపెట్టి రాష్ట్రంలోనే కొత్త పాలనకు నాంది పలికారు. నవరత్నాలతో సంక్షేమాన్ని పేదింటి గడపకే చేరవేశారు. ఇక కోవిడ్ సమయంలో ఆయన సాహసోపేతమైన చర్యలు తీసుకున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలో నిధులు జమచేశారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధిబాట చూపించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద లక్షలాది మందికి ఆర్థిక సాయం చేసి మనసున్న మారాజుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ రెడ్డి, రేఖా రెడ్డి, అవంతి రెడ్డి, లక్ష్మీ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామిరెడ్డి, సుదర్శన్, గోవింద్ రెడ్డి, తెలుగు ప్రసాద్, సునీల్ కుమార్, వైఎస్ఆర్సిపి అభిమానులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# బేగంపేటలో కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా మరో ప్రపంచ రికార్డుకు అడుగు




సోమాజిగూడ/మేజర్ న్యూస్: బేగంపేటలోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా మరో ప్రపంచ రికార్డు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఐదు ప్రపంచ రికార్డులు సాధించిన ఈ సంస్థ, తాజాగా సంప్రదాయ వంటకాల ప్రదర్శనతో మరో ఘనతకు సిద్ధమైంది. క్రిస్మస్ సందర్భంగా పరంపరగాట పాక కళ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధ సంప్రదాయ వంటకాలను విద్యార్థులు తయారు చేసి ఆకట్టుకున్నారు. ఒక్క రాష్ట్రానికే పరిమితం కాకుండా, భారతదేశ వ్యాప్తంగా ఉన్న వంటకాల వైవిధ్యాన్ని ఒకే వేదికపై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వంద నాలుగు మంది విద్యార్థులు, వంద నాలుగు వంటకాలను ఏకకాలంలో తయారు చేయడం విశేషం. పూర్వ కాలంలో మన తాతలు, ముత్తాతలు వంటలు చేసిన విధానాన్నే అనుసరిస్తూ, గ్యాస్ పొయ్యిలు వినియోగించకుండా కట్టెల పొయ్యి, పొట్టు పొయ్యి, మట్టి పొయ్యి, ఇసుకతో వంటలు చేసి చూపించారు. ఇప్పటివరకు ప్రపంచంలో ఒకే సారి వందకు పైగా వంటకాలను, వందమందికి పైగా వ్యక్తులు ఏకకాలంలో తయారు చేయలేదని అకాడమీ చైర్మన్ సుధాకర్ రావు తెలిపారు. ఆయిల్ లేకుండానే పూర్వీకులు అద్భుతమైన వంటకాలు తయారు చేశారని, వాటిని నేటి యువత పరిశోధన చేసి మళ్లీ జీవం పోసిన విధానం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన అన్నారు. ఈ ప్రయత్నానికి ప్రపంచ రికార్డు తప్పకుండా లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి చెఫ్ మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలు, వాటి విధానాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు ప్రశంసల జల్లు కురిపించారు.

# అభివృద్ధి పనులు పరిశీలన

## ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తున్నాం - సీఎన్.రెడ్డి



రహ్మత్‌నగర్ , మేజర్ న్యూస్.. డివిజన్ పరిధిలోని సంజయ్‌నగర్, ఇంద్రానగర్ ఫేజ్ 2 బస్తీలలో చేపడుతున్న సివరేజ్ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సీఎన్.రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కుంటున్న మౌలిక వసతుల సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలన్న తలంపుతో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నాము. ఇందులో భాగంగా సంజయ్‌నగర్ 28.8 లక్షలు అలాగే ఇంద్రానగర్ ఫేజ్ 2 బస్తీలో 12 లక్షల రూపాలయ నిధులతో సివరేజ్ పైప్‌లైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రానగర్ ఫేజ్ 2 బస్తీ అధ్యక్ష్యులు వేముల యాదయ్య, కమిటీ సభ్యులు చెన్నయ్య, సుబ్బారెడ్డి, వేములు వెంకటేష్ , పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ప్రతి కాలనీ ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం





హయత్ నగర్, మేజర్ న్యూస్ః ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చి దిద్దడమే తమ లక్ష్యం అని జీహెచ్ ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ లోని హయత్ నగర్ ప్రాంతం విష్ణు నగర్ కాలనీ, సీఎస్ ఆర్ కాలనీ ఫేస్ -2 లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీ వాసులు ఆహ్వానం మేరకు ఇంకా కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను కాలనీవాసులతో కలిసి పర్యటించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సిహెచ్.సింహాద్రి చారి,శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, మధు నాయక్, లింగ స్వామి గౌడ్, రవి గౌడ్, మానియా నాయక్, కృష్ణ రెడ్డి, పక్కెరయ్య, జి.మహేష్, యం.శంకరయ్య, ఉపేందర్, వెంకట్, డి.రవి కుమార్, పెద్దిరాజు, ప్రసాద్, అనంత రెడ్డి, రామ్ రెడ్డి, బ్రహ్మ చారి, శ్రీధర్, రత్నాకర్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు



హయత్ నగర్, మేజర్ న్యూస్: పోక్సో కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు వ్యక్తికి జీవిత ఖైదు విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ బండ్లగూడ వడ్డెర బస్తీకి చెందిన దండల సాయి 2023 నవంబర్ 16న ఏపూరి కాలనీలో ఉంటున్న ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు వరకు నాగుల్ పోలీస్ స్టేషన్లో పోక్సో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు విషయంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి సాయిని నేరస్తుడిగా ధ్రువీకరిస్తూ జీవిత ఖైదు శిక్షణ విధించినట్లు పోలీసులు తెలిపారు.

# నిజాలు నిర్భయంగా రాస్తాం, ఎన్ని దాడులైనా ఎదుర్కొంటాం

## భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యం గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: అవినీతి, అక్రమాలను ప్రశ్నించే రిపోర్టర్లపై అధికారుల బెదిరింపులను, దాడులను ఖండిస్తూ జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అధికారుల తీరుపై జీహెచ్ఎంసి కమీషనర్ కి వినతి పత్రం అందించాలని వెళ్లిన జర్నలిస్టులను నిర్భందించి అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యం మాట్లాడుతూ అటు ప్రభుత్వాలకు, ఇటు ప్రజలకు వారధిగా ఉంటూ, నిజాలు నిర్భయంగా రాసే మాకు బెదిరింపులు, అక్రమ కేసులా నిజాలు రాయడమా మేము చేస్తున్న తప్పులా, మరి సుప్రీం కోర్టే చెప్పిందిగా ప్రశ్నించే హక్కు కేవలం మీడియాకు మాత్రమే ఉందని, ప్రజలకు కనిపిస్తున్న అక్రమాలు జీహెచ్ఎంసి అధికారులకు ఎందుకు కనిపించడం లేదని హై కోర్టు ఇదివరకే మొట్టికాయలు వేసినా అధికారులు మారరా అని ప్రశ్నించారు. లంచాలు తీసుకుంటూ రోజుకు ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడతలేరు. ఇవి మేము రాయొద్దా..మొన్నటికి మొన్న ఒక అధికారి రూమ్ నిండా నోట్ల కట్టలు కాల్చలేదా. ఇది అధికార దుర్వినియోగం కాదా? అంచాలు తీసుకుంటూ, రోజుకో అధికారి ఏసీబీకి పట్టుబడడం లేదా? నిన్నటికి నిన్న ఓ సర్పంచు పటాన్ చెరువులో సర్పంచ్ ఎలక్షన్లో 17 కోట్లు ఖర్చు పెట్టాడు. చిత్రమేంటంటే ఒక్కో ఓటుకు 40 వేలు ఇచ్చిందికాక, 4 కోట్లు మందుకు (కేవలం మద్యానికి) ఖర్చు పెట్టాడు. ఆ వార్త రాసింది మా మీడియా మిత్రులేగా, ఇలాంటి నిజాలు ఇంకా ఎన్నో, ఎన్నెన్నో.. ఇవి రాయొద్దని బెదిరిస్తారా.. ప్రాణాలైనా అర్పిస్తాం, నిజాలని నిర్భయంగా రాస్తాం అని సత్యం గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రామకృష్ణ, సతీష్, శ్రీనివాస్ గౌడ్, సూరన్న, రాజు, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి ప్రశాంతత : కొలన్ శ్రీనివాస్ రెడ్డి



నిజాంపేట్ మేజర్ న్యూస్ : ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి ప్రశాంతత లభిస్తుందని, ఆ దిశగా భక్తుల మనోభావాలకు తగినట్టుగా ఆలయాల అభివృద్ధిలో తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప శ్రీ శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వామి శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవస్థానముల చైర్మన్ శ్రీ కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం దేవస్థానం అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు రాజీవ్ గృహకల్ప ఆలయ అభివృద్ధికి గాను రూ.50 వేల విరాళాన్ని అందజేయగా, కొలన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఆలవాలం అని, అలాంటి ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా మరింత మందికి ప్రశాంతతను చేకూర్చినవారమవుతారు. ఆ క్రమంలోనే నిజాంపేటతో పాటు మరికొంత ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధిలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజీవ్ గృహకల్ప ఇల్లా సముదాయ నివాసితులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఇక్కడి ఉమామహేశ్వర స్వామిని, నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధిలో పితాని శ్రీనివాసరావు తీసుకుంటున్న చొరవను ఆయన అభినందించారు. సొంత నిధులను వెచ్చించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారుడు రామచంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కమిటీ సభ్యుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హయత్ నగర్ ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన అధికారులు



హయత్ నగర్, మేజర్ న్యూస్ః హయత్నగర్ ఆర్టీసీ డిపో-1ను గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డిపో లో ఉద్యోగులతో ముఖముఖిగా మాట్లాడి, ఉద్యోగుల భోజన గదులు, విశ్రాంతి గదులు, తనిఖీ చేసి వారితో సంస్థ ప్రస్తుత ఆర్థిక విషయాలు చర్చించారు. రాబోయే రోజులలో మన సంస్థను మరింత అభివృద్ధి చెయ్యాలని, వచ్చే నెలలో జరిగే మేడారం జాతర గురించి బస్సు లు ఎలాంటి బ్రేక్ డౌన్ లు జరుగకుండా ప్రజలకు నాణ్యమైనా సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా డిపోలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ రీజినల్ సహాయ మేనేజర్ శ్రీనివాస్ రావు, డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్ లు సరస్వతి, సత్తయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

# బాలసరస్వతి నగర్‌లో పవర్ బోర్ మరమ్మతు



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని బాలసరస్వతి నగర్ లో సోమవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ పర్యటించారు. ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి ఆదేశాలు మేరకు బాలసర స్వతిన గర్ లో పాడైపోయిన పవర్ బోరును రిపేర్ చేయిం చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసగోని శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ రావు, కేశెట్టి రాములు, ఎండీ అలీ సతీష్,సుధా,శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు

# నిత్యం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్‌లను మర్యాద పూర్వకంగా కలిసిన కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులు



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃనిత్యం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా పని చేస్తున్న కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు నరోత్తమ్‌కుమార్, ఈసి సభ్యులు సిద్దార్ద్ పొల్చం, సునీల్ దారాడేలు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ ప్రభు దాస్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తు శాలువాలతో సత్కరించారు. సమాజ హితం కోరుతు కృష్ణ గోపాల్ సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు హర్షణీయమని, ఇలాంటి కార్యక్రమాలు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ సందర్బంగా ఎమ్మెల్యే, కార్పోరేటర్ లు వెల్లడించారని సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

# దేశ స్వచ్ఛతలో బస్తీలది ముఖ్యపాత్ర



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : భారత దేశము పరిశుభ్రంగా ఉండాలంటే మొదటగా బస్తీలు పరిశుభ్రంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపినట్లుగా గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ అన్నారు. సోమవారం ప్రధాని పిలుపుమేరకు డివిజన్లోని నేతాజీ నగర్ బస్తీలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బ్లాక్ కు ఒక డస్ట్ బిన్ అందజేశారు. 38 బ్లాక్ లకు గాను 38 డస్ట్ బిన్స్ ఇచ్చారు. 68 కుటుంబాలు నివసిస్తున్న పూల్ బాగ్లో ప్రతి బ్లాక్ ప్రజలు డస్ట్ బిన్ లో పొడి చెత్త వేయాల్సిందిగా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుండి చెత్త తీసుకువెళ్లే ఆటోకు 25 రూపాయల చొప్పున చెల్లించాలని సూచించారు. చెత్త పరిసరాల్లో పారేయడం మూలంగా బస్తీలో దోమలు విపరీతంగా వ్యాపించి మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నట్లు అవగాహన కల్పించారు. కనుక ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని మన పరిసరాలను శుభ్రంగా మార్చుకుందాం.. నరేంద్ర మోడీ స్ఫూర్తితో మన బస్తీలు , మన నగరాన్ని మన దేశాన్ని పరిశుభ్రంగా మార్చుకుందామని పేర్కొన్నారు. అనంతరం పారిశుద్ధ కార్మికులు, స్వీపర్లు, ఎస్ఎఫ్ఎ లను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓం ప్రకాష్ బీష్వా, ఎస్ ఎస్ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఏ మహేందర్, నిర్మల్ రాజు , రాజ్ కమల్ , నితీష్ , బస్తీ వాసులు పాల్గొనడం జరిగింది

## పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయనిధి



గాజులరామారం మేజర్ న్యూస్ : సీఎం సహాయనిధి పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. 125 గాజుల రామారం డివిజన్ చంద్ర గిరి నగర్ కు చెందిన కలీమా (50) భర్త భక్షు మియా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు యూసుఫ్ ఖాన్ ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2 లక్ష రూపాయలను మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గాజుల రామారం డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అద్వకేట్ కమలాకర్, ఇతర ముఖ్య నాయకులు కలిసి సోమవారం లబ్ధిదారులు కలీమా కుటుంబసభ్యులకు ఎల్వోసీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిన్నా చౌదరి, బాబీ చౌదరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# చాణక్య హై స్కూల్ విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్

## 2025 నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్సుకు గుర్తింపు




జగదిరిగుట్ట, మేజర్ న్యూస్: 2025లో నిర్వహించిన తొలి నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో అశోక్ మెమోరియల్ చాణక్య హై స్కూల్ కు చెందిన మాస్టర్ అరోల్లా నాగరాజు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి 11 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్ సాధించి ఘన విజయాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను బి ఎస్ కే ఎ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ షిహాన్ కె. పృథ్వి విజయవంతంగా నిర్వ హించారు. దేశవ్యాప్తంగా వివిధ జట్లు పాల్గొన్న ఈ పోటీలో, అన్ని జట్లతో పోలిస్తే అశోక్ మెమోరియల్ చాణక్య హై స్కూల్ విద్యార్థులు అత్యధిక గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. ఈ విజయం పాఠశాలకు గర్వకా రణంగా నిలవడమే కాకుండా, రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ స్థాయిలో కూడా ఏ ఎం సి హెచ్ ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడం ఎంతో ఆనందదాయకం. జాతీయ వేదికపై 11 గోల్డ్ మెడల్స్ గెలుచుకోవడం పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. ఈ విజయవార్త తెలుసుకున్న ప్రిన్సిపల్ శ్రీమతి వనజ గారు అపార ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మెడల్స్ సాధించి ఏ ఎం సి హెచ్ ఎస్ పేరును అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతినిధ్యం వహించాలని ఆమె ఆకాంక్షించారు.

## కొలిశెట్టి సంజయ్‌కుమార్‌కు వనస్థలిపురం ఫేస్ – 4 కాలనీ వారు రూపొందించిన సావనీర్ బుక్‌లెట్‌ను అందజేసిన కాలనీ వాసులు

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః ప్రగతి పథంలో మనం – మన కాలనీ పేరుతో వనస్థలిపురం ఫేజ్ –4 హౌజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు రూపొందించిన ప్రత్యేక సంచికను వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు కొలిశెట్టి సంజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్ వారు చేసిన కృషిని, కష్టాలను వారు గుర్తు చేశారు. వనస్థలిపురం ఫేస్ – 4 కాలనీ అభివృద్ధి సంక్షేమం కోసం కాలనీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచంపల్లి శ్రీధర్‌రావు ఇతర కార్యకర్త సభ్యులు చేసిన కృషి ఎంతో విశిష్టమైనదని, వయస్సులో పెద్ద వారైనా కూడా వయస్సును లెక్క చేయకుండా కాలనీ అభివృద్ధే లక్ష్యంగా పెద్దలు ముందుకు సాగడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా కొలిశెట్టి సంజయ్‌కుమార్‌గుర్తు చేశారు. వనస్థలిపురం ఫేస్ – 4 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ను స్ఫూర్తిగా తీసుకొని వనస్థలిపురం పరిసర ప్రాంత కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ వారు తీసుకొని కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



# సర్పంచ్‌గా మొదటి చేయూత

- ప్రమాణస్వీకారం రోజే ఇచ్చిన హామీ అమలు
- సర్పంచ్ వేణుగోపాల్‌కు అభినందనల వెల్లువ





షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (డిసెంబరు 22): గ్రామ సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన మొదటిరోజే ఎన్నికల ప్రచారంలో ఇద్దరు పేదలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు ఆ గ్రామ సర్పంచ్. కేశంపేట మండలంలోని సంగెం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయితీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఇందులో బాగంగా గ్రామ సర్పంచ్ గా గ న్నోజు వేణుగోపాల్ చారి, డిప్యూటీ సర్పంచ్‌గా ఎండి షకీల్‌తో పాటు వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ తాను ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో గ్రామానికి చెందిన ఇరువురు పేదలైన పుట్టోని గూడెం లక్ష్మమ్మ, జోగన్నగూడెం నర్సింహులు తమకు పెన్షన్ రావడం లేదని, ఎలాగైన ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ నేపథ్యంలో తాను సర్పంచ్‌గా గెలిచిన తరువాత మీకు ప్రభుత్వం ద్వారా పెన్షన్ అందేలా చూస్తానని అంతవరకు తానే సొంతంగా ఇద్దరికి ప్రతి నెల పెన్షన్‌ను అందిస్తానని మాట ఇచ్చారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్‌గా గెలిచి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే గుర్తు పెట్టుకుని మరీ వారిని పంచాయితీ కార్యాలయాలనికి పిలిపించి వార్డు సభ్యురాలి సమక్షంలో ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున ఇద్దరికి కలిపి నాలుగు వేల నగదును అందించాడు. ప్రభుత్వం ద్వారా పెన్షన్‌ను కలిపించేవరకు వారికి ప్రతి నెలా సొంతంగా పెన్షన్ అందిస్తానని మరోసారి భరోసా ఇచ్చాడు. సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న రోజునే ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకుని మరీ దానిని నె రవేర్చిన సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ చారిని గ్రామస్థులతో పాటు పలువురు అభినందించారు.

# న్యాయవాదులకు పోషకాహార అవగాహన సదస్సు

## నాంపల్లి క్రిమినల్ కోర్ట్‌లో నిపుణుల కీలక సూచనలు

**సోమాజిగూడ/మేజర్ న్యూస్:** నిరంతర పని ఒత్తిడి, సమయాభావం, అనియమిత జీవనశైలితో న్యాయవాదులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు నాంపల్లి క్రిమినల్ కోర్ట్ ప్రాంగణంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ప్రముఖ పోషకాహార నిపుణులు పాల్గొని న్యాయవాదులకు విలువైన సూచనలు అందించారు. సదస్సులో అంకిత మాట్లాడుతూ, పేగుల ఆరోగ్యం మొత్తం శరీర ఆరోగ్యానికి మూలమని తెలిపారు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోతే జీర్ణక్రియ దెబ్బతిని అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. సమయానికి భోజనం చేయడం, సహజమైన ఆహారాన్ని అలవాటు చేసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. పోషకాహార నిపుణులు కీవా సంస్థ పోషకహార నిపుణులు అశ్విని మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్త్రీల శారీరక నిర్మాణానికి అనుగుణంగా పోషకాహారం తీసుకోవడం వల్ల హార్మోన్ అసమతుల్యత, బలహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. సమతుల్య ఆహారం మానసిక ఆరోగ్యానికీ మేలు చేస్తుందని వివరించారు. పోషకహార నిపుణులు కిరణ్ మాట్లాడుతూ, శరీర ఎదుగుదలతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే చిన్న వయసు నుంచే సరైన ఆహార అలవాట్లు అవసరమని పేర్కొన్నారు. పని ఒత్తిడిలోనూ ఆరోగ్యాన్ని ఎలా సమతుల్యం చేసుకోవాలో న్యాయవాదులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.రవి కిషోర్, ప్రధాన కార్యదర్శి రమణ గౌడ్, ఉపాధ్యక్షులు జి. చంద్ర మోహన్,డి. రవీందర్, మహిళా ప్రతినిధి పద్మావతి పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు హనీఫ్ ఖాన్, అమర్ గుప్త, రఘు తదితరులు హాజరై సదస్సును విజయవంతం చేశారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు ఆరోగ్యాన్ని కూడా సమానంగా చూసుకోవాల్సిన అవసరంపై ఈ సదస్సు న్యాయవాదుల్లో మంచి అవగాహనను కల్పించిందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని పాల్గొన్న న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం అనంతరం తెలంగాణా బార్ కౌన్సిల్ సభ్యులు జితేందర్ రెడ్డి పోషకాహార నిపుణులను శాలువా లతో సత్కరించారు.

# శివ మెడికల్ షాపు ప్రారంభం




మణికొండ, మేజర్ న్యూస్ (డిసెంబర్ 21)ః మణికొండ మున్సిపల్‌లోని పుప్పాలగూడాలోని నూతనంగా ఏర్పాటుచేసిన శివ మెడికల్ షాప్‌ను ముఖ్య అతిథిగా మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కస్తూరి నరేందర్ తదితర స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్, నరేందర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు జితేందర్, వర్కింగ్ ప్రసిడెంట్ కిరణ్, సినియర్ నాయకులు నరేష్, ముత్యాలు, మాజీ కో అప్షన్ సభ్యులు తాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం

హయత్ నగర్, మేజర్ న్యూస్ :ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత విభాగం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ప్రాధాన్యత, ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజును పురస్కరించుకుని జరుపుకుంటామని తెలపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన మరియు గణిత క్విజ్ పోటీలను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహ, డాక్టర్ మక్లా, విద్యాసాగర్, రమాదేవి, పెదయ్య, తదితరులు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# స్థానిక ఎమ్మెల్యేకి వినతి పత్రం



మణికొండ, మేజర్ న్యూస్ (డిసెంబర్ 21)ః మణికొండ మున్సిపల్ ని రెండు డివిజన్‌లుగా విభజించి జిహెచ్‌ఎమ్‌సి లో విలీనం చేయడం అందరికి తెలిసిన విషయమె. దినిలో మణికొండ డివిజన్, నెక్నాంపూర్ డివిజన్‌లుగా ఏర్పాటుచేయాలని నెక్నాంపూర్ డివిజన్ పేరు మార్చకుండా చూడాలని నేక్నాంపూర్ వాసులు ఎర్రోళ్ల వేణు కుమార్ స్థానికులతో కలిసి స్థాణిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ స్వామి, శంకర్‌సింగ్, శివకృష్ణ, ఆనంద్‌రావు, నియంత్, లక్ష్మి, సీమరాణి పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్, కాకినాడలో ఆర్.ఎస్. బ్రదర్స్ వారి కనువిందైన నూతన షోరూమ్










కాకినాడ, మేజర్‌న్యూస్ : 2025 డిసెంబర్ 22వ తేదీ నాడు కాకినాడలో సరికొత్త షోరూమ్‌కు శుభారంభం చేయడం ద్వారా ఆర్.ఎస్. బ్రదర్స్ మరో మైలురాయిని చేరుకొంది. దక్షిణ భారతదేశంలోని షాపింగ్‌ప్రియుల వినూత్న స్వప్నాన్ని ఇది సాకారం చేస్తోంది. దార్శనికులైన పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, దివంగత సత్యనారాయణల చేత నెలకొల్పబడిన ఈ సంస్థ విజయవంతంగా ముందుకు దూసుకుపోతోంది. సంప్రదాయాన్ని, అధునాతన ఫ్యాషన్లను కలగలిపి అందరి అభిరుచులనూ ప్రతిబింబిస్తూ, అన్ని తరాలవారి ఆదరాభిమానాలనూ, విశ్వసనీయతనూ చూరగొంటోంది. అందుబాటు ధరలలో అందానికి అందం, నాణ్యతకు నాణ్యత కలిగిన వైవిధ్యభరిత వస్త్రశ్రేణిని ఆర్.ఎస్.బ్రదర్స్ అందిస్తోంది. ఈ సందర్భంగా వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు), ఎమ్మెల్యే, కాకినాడ సిటీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆర్.ఎస్. బ్రదర్స్ షోరూమ్ అధినేతలను అభినందించారు. ప్రముఖ నటి కుమారి నిధి అగర్వాల్ ప్రముఖ అతిథిగా విచ్చేసిన ఈ శుభారంభ



కార్యక్రమాన్ని కాకినాడలోని వస్త్రప్రియులు అత్యంత ఉత్సాహంగా వీక్షించారు. "ఆర్.ఎస్. బ్రదర్స్ వారి కనువిందైన కాకినాడ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం నాకెంతో ఆనందంగా ఉంది. పెళ్లి, పుట్టినరోజు, పండుగలు వంటి అన్ని రకాల వేడుకలకు అచ్చంగా సరితూగే వస్త్ర విశేషాలు కాకినాడ వాసుల కోసం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ షోరూమ్‌లో అడుగుపెట్టి పండగ వాతావరణాన్ని కలకాలం మీతో కొనసాగేలా చేసుకోండి" అంటూ నిధి అగర్వాల్ కాకినాడ వాసులకు స్వాగతం పలికారు. ఆర్.ఎస్.బి రిటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ షోరూమ్ కాకినాడ, పరిసర ప్రాంతాలకు చెందిన అన్నితరాల కస్టమర్ల పట్ల తమ అంకిత భావాన్ని ప్రతిబింబిస్తుంది అన్నారు. చైర్‌పర్సన్ హోల్-టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ, "తాము నెలకొల్పే ప్రతీ కొత్త షోరూమూ పండుగలను, వివాహాది వేడుకలను వినియోగదారుల ముంగిట్లో ఆవిష్కరిస్తాయని" అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సీర్ణ రాజమౌళి మాట్లాడుతూ– "భారతదేశవ్యాప్తంగా విస్తరించిన కనువిందైన కలెక్షన్లు తమ కాకినాడ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయి. నూతన వధూవరుల అలంకరణ వస్త్రాలు మొదలుకుని, అన్ని శుభకార్యాలకు అచ్చంగా సరిపోయే కలెక్షన్ల కోసం కాకినాడ వాసులు మా సరికొత్త షోరూమ్‌కి విచ్చేయండి" అన్నారు. హోల్-టైం డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ– "ధరలోనూ, నాణ్యతలోనూ, అన్ని తరాల అభిరుచుల్లోనూ ఆర్.ఎస్. బ్రదర్స్ వస్త్రవైవిధ్యం సాటిలేనిది" అన్నారు. కాకినాడ ఆర్.ఎస్. బ్రదర్స్‌లో ఉమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్– ఇలా ఏది తీసుకున్నా అన్నిటా




ప్రత్యేకత కనిపిస్తుంది. అందాలు చిందే కంచి పట్టుచీరెలు మొదలుకుని, ఇతర శారీలు, లెహంగాలు, కుర్తాలు, పైజమాల వరకు, పండగ దుస్తుల నుంచి విలాసవంతమైన వెస్టర్న్ డ్రెస్ వరకు మీరు కోరినవన్నీ ఒకేచోట లభించే ఏకైక షోరూమ్... కాకినాడ ఆర్.ఎస్. బ్రదర్స్ షోరూమ్!

# గ్రామస్తులకు అండగా ఉంటా

## –సర్పంచ్ తిప్పని మాధవిరాంరెడ్డి






చేవెళ్ల, మేజర్‌న్యూస్(డిసెంబర్ 22) ః రేగడిఘనాపూర్ గ్రామస్తులకు అండగా ఉంటానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ తిప్పని మాధవిరాంరెడ్డి అన్నారు. రేగడిఘనాపూర్ గ్రామంలో జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, గుడుపల్లి సుమారెడ్డి, మల్గారి అంజిరెడ్డి, మల్గారి అలవేలు, మల్గారి డా.సాయితేజరెడ్డి, మల్గారి డా.చందనరెడ్డి, గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. గ్రామస్తులు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇచ్చిన హామీలను తీరుస్తానన్నారు. గ్రామస్తులకు నిత్యం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకాధికారి రంజిత్, ఉపసర్పంచ్ ఈదులపల్లి మహేశ్వరిరాములు, నాయకులు రాజేష్, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

# నార్లకుంట సర్పంచ్‌కు బాల్యమిత్రుల ఘనసత్కారం



కడ్తాల్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 22): కడ్తాల్ మండలం నార్లకుంట గ్రామపంచాయతి సర్పంచ్‌గా ఎన్నికైన రాంచందర్‌నాయక్‌ను సోమవారం 1989–90 ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన ఆయన బాల్యమిత్రులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నార్లకుంట తాండ గ్రామపంచాయతి సర్పంచ్‌గా పదవీ ప్రమాణస్వీకారం అనంతరం రాంచందర్‌నాయక్‌ను వారు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ చిన్ననాటి స్నేహితుడు గ్రామప్రథమ పౌరుడిగా ఎన్నికవ్వడం ఆనందంగా వుందని, నిజాయితి, సేవాభావం కలిగిన రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో నార్లకుంటతాండ గ్రామపంచాయతి సమగ్రాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్‌నాయక్ మిత్రులు వెంకటేష్, యాదయ్య, బిక్షపతి, సాయిలు, పాత్లావత్ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయతిలలో కొలువుదీరిన కొత్త సర్పంచ్‌లు

- నందిగామ మండలంలో అట్టహాసంగా జి.పి పాలకవర్గ ప్రదవీప్రమాణస్వీకారోత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరైన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 22): నందిగామ మండలంలోని 19 గ్రామపంచాయతిలలో సోమవారం నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యుల పదవీ ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నందిగామ గ్రామపంచాయతిలో సర్పంచ్‌గా కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ మంజుల యాదగిరి, నర్సప్పగూడ కోడిచెర్ల రాజేశ్వరి శ్రీనివాస్, చేగూర్‌లో మంకాల శ్రీశైలం, బండోనిగూడ జెట్టా కుమార్, బుగ్గోనిగూడలో బుగ్గ సాలయ్య, మేకగూడలో రమావత్ మారు రాజు నాయక్, రంగాపూర్‌లో గోవు అంజమ్మ, సిడి తండాలో ముడావత్ గబ్రుచౌహన్, వెంకమ్మ గూడలో గొర్లపల్లి అశోక్, అప్పరెడ్డి గూడలో మల్లేష్, వీర్లపల్లిలో పాండు నాయక్, మొదల్లగూడలో అరుణ రాజు, మామిడిపల్లిలో హనుమంత్ రెడ్డి, ఈదులపల్లిలో సులోచన గణేష్, మొత్కులగూడలో లావణ్య రమేష్ , తాళ్ళగూడలో గోవింద్ గౌడ్, కన్హా శాంతి వనంలో ఏలేటి మధుసూదన్ రెడ్డి తదితరులు సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నంది గామ సర్పంచ్‌గా బాధ్య తలు చేపట్టిన కొమ్ము కృష్ణ, పాలక వర్గ సభ్యులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి చేస్తా :మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి

చేవెళ్ల, మేజర్‌న్యూస్(డిసెంబర్ 22) ః విద్యాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్లవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు స్వంత నిధులు రూ.3లక్షలతో ప్రీకాస్ట్, రూ.50వేలతో మెయిన్ గేట్ వేయించి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ....విద్యాభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో దాతాల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యకోసం తాను ఎల్లప్పుడు ముందుంటానని, పేద విద్యార్థుల చదువులకు తనవంతు సహాయసహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈకార్యక్రమంలో బీజేపీ యువనాయకులు డా.మల్గారి వైభవ్‌రెడ్డి, సర్పంచ్ జుట్టు లావణ్యయాదయ్య, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించి పేరు ప్రతిష్టలు తీసుకరావాలి

★ బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహరెడ్డి



కందుకూరు, మేజర్ న్యూస్( డిసెంబర్ 22): ప్రజలు నమ్మ కంతో గ్రామ ప్రజా ప్రతినిధులుగా ఎన్ను కున్నందుకు ప్రజా సమస్యలను పరిష్కరించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని 12 బీజేపీ బలపరిచి విజయం సాధించిన పంచాయతీ నూతన పాలకవర్గాన్ని మండల బీజేపీ అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో మండలంలోని బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఇంద్రకంటి రవిందర్‌గౌడ్, బీజేవైయం నాయకులు డిల్లీ అనిల్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.